లోక్‌సత్తా
ప్రజలే ప్రభువులు

# ప్రజారాజ్యం

లోక్‌సత్తా 'ఇ' సమాచారపత్రం

సంపుటి : 1
సంచిక : 2
జనవరి 16-31, 2006

## కొత్త రాజకీయ సంస్కృతికి అవసరమయితే తగిన రాజకీయ శక్తుల్ని సృష్టిస్తాం

డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రకటన

దేశంలోని 50 జిల్లాల్లో పాలన లేదు, రాజ్యాంగం లేదు, ప్రజాస్వామ్యం లేదు, స్వేచ్ఛలేదు. కలెక్టర్‌లు జిల్లాల్లో తిరుగలేరు, మంత్రులు గ్రామాలకు వెళ్ళలేరు. దాదాపుగా ఇలాంటి పరిస్థితే దేశంలో మరో 150-200 జిల్లాల్లో పాక్షికంగా వుంది. ఇంతకన్నా సంక్షోభం అంటే ఇంకేంటి? ఢిల్లీని కబళిస్తేనే సంక్షోభం అనుకోవాలా? ఈ సంక్షోభానికి సమాధానం చెప్పవలసిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద వుంది. స్వేచ్ఛగా ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజలు జీవించే అవకాశం వుండాలా లేక తుపాకులు పట్టుకోవాలా? నిర్ణయించాల్సిన స్థితి నేడు వుంది. రాజకీయ పార్టీలు సంక్షోభం ఏమి లేనట్లు పైపైకి నటిస్తున్నాయి, ఫోన్‌ట్యాపింగ్ అని, ఎమ్.పిల ముడుపులని.. ఈ సంక్షోభం నుండి ఎలా బయటపడాలో ప్రతి ఒక్కరు ఆలోచించాలి. పార్టీలు, ప్రజాస్వామ్య వాదులు, పౌరసమాజ సంస్థలు అందరూ ఆలోచించాలి.

మనం లోక్‌సత్తా ఉద్యమంలో గత తొమ్మిదేళ్ళుగా ఒక వ్యూహాన్ని అనుసరించాం. కొన్ని ఫలితాలు సాధించాం. భావపరంగా ఒక పునాది వేయగలిగాం. ప్రజలు ప్రభువులనే భావాన్ని బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్ళగలిగాం. ఇది సరిపోతుందా? కొత్త పద్ధతులు కావాలా? ఆలోచించుకోవాలి. సమాచార చట్టం వచ్చింది, స్థానిక న్యాయాలయాలు తెస్తామంటున్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి కొన్ని మార్పులు తీసుకురాగలిగాం. ఇలాంటి మార్పులు ఎన్ని వచ్చినా ప్రజల జీవితం ఏ మేరకు మెరుగుపడింది అని ఆలోచిస్తే రాజకీయ సంస్కృతి మారకుండా, ఎన్ని చట్టాలు వచ్చినా ప్రయోజనం ఆశించినంతగా ఉండదని అర్థం అయ్యింది.రాజకీయ సంస్కృతిని మార్చాలంటే ఏం చెయ్యాలి?

మార్పుని త్వరగా అంగీకరించని సమాజం మనది. రాజకీయపార్టీలు కూడా అంతే. మారకపోతే మనుగడకే ముప్పు అనుకున్నప్పుడే పార్టీలు మార్పుకు అంగీకరిస్తాయి. అందుకు కృషి చేస్తాయి. దానికి తగిన వ్యూహాం మనం రూపొందించుకోవాలి. సంక్షోభం నుండి బయటపడటానికి మనం మార్గాలు సూచిస్తున్నాం. దామాషా పద్ధతిలో ఎన్నికలు గాని, పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం కానీ, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వాధినేతకు ప్రత్యక్ష ఎన్నికగాని, మార్గాలు వున్నాయి. అవి అనుసరించాలనే చిత్తశుద్ధి కావాలి. అటు జాతీయ పార్టీల మనుగడకు, ఇటు ప్రాంతీయ పార్టీల ప్రయోజనాలకు ఇబ్బంది కలుగనటువంటి మార్గాలు మనం సూచిస్తున్నాం. ఇవి వాళ్ళు పాటించకుంటే, మార్పుకు కృషిచేయకుంటే మనం ఇలాగే చూస్తూ కూర్చుంటామా?

దేశంలో మార్పులు తేవాలనిగదా మనం లోక్‌సత్తాను ఏర్పాటుచేసుకున్నది. దేశంలో మార్పులకు లోక్‌సత్తా సంస్థ ఒక మార్గం మాత్రమే. ఒక సాధనం మాత్రమే. లోక్‌సత్తా సంస్థకన్నా లోక్‌సత్తా ఉద్యమం మరింత పెద్దది. దేశ ప్రయోజనాలు లోక్‌సత్తా ఉద్యమానికన్నా మరింత ముఖ్యమైనవి. మనం ఆ దృష్టితో ఆలోచించాలి. దేశం సంక్షోభంలో ఉన్నప్పుడు, దేశం మనల్ని పిలుస్తున్నప్పుడు మన స్పందించకపోతే చరిత్ర మనల్ని క్షమించదు. మన శక్తి సరిపోదంటారా? నేనూ ఒప్పుకుంటాను. ఆ మాటకొస్తే దేశంలో ఎవరిశక్తీ సరిపోదు. శక్తి సరిపోకపోతే అరువు తెచ్చుకుంటాం. అంతేగాని శక్తి సరిపోదని చేతులు ముడుచుకు కూర్చోము. రాజకీయ పార్టీలను మారమని, కొత్త రాజకీయ సంస్కృతిని సృష్టించమని చెపుతున్నాం. వారు మారకపోతే దానికి తగిన రాజకీయ శక్తుల్ని సృష్టిస్తాం. మళ్ళీ చెపుతున్నాను అవసరమయితే కొత్త రాజకీయ శక్తుల్ని సృష్టిస్తాం.

లోక్‌సత్తా చేస్తున్నది రాజకీయం. లోక్‌సత్తా ముమ్మాటికీ రాజకీయ సంస్థే. అయితే మనం ఇన్నాళ్ళు ఎన్నికల రాజకీయాలకు దూరంగా వున్నాం. మనం ఉద్యమ ప్రారంభం నుండి చెబుతున్నాం "రాజకీయాలు పవిత్ర వ్యాసంగం" అని. మన మాటలు మనమే విశ్వసించకపోతే ఎలా? అందుకే చెబుతున్నాను దేశంలో రాజకీయ సంస్కృతిని మార్చేందుకు కృషి చేద్దాం. అవసరమయితే కొత్త రాజకీయ శక్తుల్ని సృష్టిద్దాం. రాజకీయాలను మారుద్దాం. ✪

(పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో జరిగిన లోక్‌సత్తా రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో డా॥ జె.పి ప్రసంగం నుంచి)

# హేతుబద్ధంగా పంచాయితీల పునర్వ్యవస్థీకరణ

## రూ. వేయి కోట్లతో పంచాయతీలకు ప్యాకేజీ-ముఖ్యమంత్రికి లోక్‌సత్తా వినతి

పంచాయతీల పునర్వ్యవస్థీకరణ రాజకీయ పక్షపాతంతో జరగకూడదని లోక్‌సత్తా అభిప్రాయపడింది. శాస్త్రీయంగా, హేతుబద్ధంగా జరిగేటట్టు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించింది. లోక్‌సత్తా జాతీయ సమన్వయకర్త జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం శుక్రవారం (06-01-2006) ఇక్కడ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డిని ఈమేరకు కలసి వినతిపత్రాన్ని అందించింది. ఈ ప్రక్రియలో జనాభాతోపాటు స్థానిక పరిస్థితుల వెసులుబాటును పరిగణనలోకి తీసుకోవాలని జయప్రకాష్ నారాయణ్ కోరారు. పంచాయతీల పునర్వ్యవ్యవస్థీకరణలో దళితులు, బలహీనవర్గాలు కిందిస్థాయిలో అధికారం పొందే అవకాశాలను కాపాడాలని, ఎన్నికలు నిరవధికంగా వాయిదా వేయకూడదని సూచించారు. ఈ అంశంపై లోక్‌సత్తా ఇతర ప్రతిపాదనలివీ... పునర్వ్యవస్థీకరణకు మెజార్టీ మద్దతు ఉన్న నేపథ్యంలో తక్షణమే చేపట్టాలి. చిన్న పంచాయతీల ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. జనసాంద్రతను, దూరాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. పంచాయతీలు బలోపేతం కావడానికి రూ. 1000/- కోట్లతో ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలి. పునర్వ్యవస్థీకరణ అనంతరం పంచాయతీలకు 29 అంశాలను బదలాయించాలి. ముఖ్యమంత్రిని సాధికారతా సమాఖ్య కార్యదర్శి సోలిపేట రామచంద్రారెడ్డి, మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఎం. సుధ, లోక్‌సత్తా రాష్ట్ర సమన్వయకర్త డి.వి.వి.ఎస్.వర్మ, ప్రధాన కార్యదర్శి భండారి అంకయ్య తదితరులు కలుసుకొన్నారు. ✪

## లోక్‌సత్తా లేఖ పూర్తిపాఠం

తేది : 05-01-2006

గౌ. డా॥ వై.యస్. రాజశేఖర రెడ్డి గార్కి,
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి
హైదరాబాద్

విషయం : పంచాయితీల పునర్‌వ్యవస్థీకరణపై వివిధ పార్టీల అభిప్రాయాల ఆధారంగా లోక్‌సత్తా చేస్తున్న ప్రతిపాదనలు.

1. పంచాయితీల పునర్వ్యవస్థీకరణ, వాటికి అధికారాలు, నిధులు, సిబ్బంది బదలాయింపు గ్రామీణాభి వృద్ధిలో కీలకపాత్ర వహిస్తుందని లోక్‌సత్తా భావిస్తున్నది.
   పంచాయితీల పునర్వ్యవస్థీకరణపై చర్చ ప్రారంభమైన నేపథ్యంలో లోక్‌సత్తా చొరవతీసుకుని దీనికి ఒక రూపం ఇవ్వాలని భావించింది. 2005 డిసెంబర్ 22 తేదీన తిరిగి 2006 జనవరి 5వ తేదీన ఈ అంశం పై వివిధ పార్టీలతో ఇష్టాగోష్టి సమావేశాలను నిర్వహించింది.
2. పంచాయితీలకు రాజ్యాంగం నిర్దేశించిన అధికారాలను గణనీయంగా బదిలీ చెయ్యడానికి, గ్రామాలలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి, గ్రామాలలోనే పంచాయితీ, రెవెన్యూ సేవలు అందించడానికి తగిన పటిష్టమైన యంత్రాంగాన్ని రూపొందించడానికి వీలుగా పంచాయితీలను పునర్వ్యవస్థీకరించడం అవసరం అని అధికార పక్షమైన కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతినిధులు, ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు సూత్రప్రాయంగా అంగీకరించారు.
   అలాగే రాష్ట్ర సర్పంచుల ఛాంబరు ప్రతినిధులు, స్థానిక ప్రభుత్వాల సాధికారత సమాఖ్య, స్థానిక ప్రభుత్వాల మహిళా ప్రజాప్రతినిధుల సమాఖ్య ప్రతినిధులు ఇలాంటి పునర్‌వ్యవస్థీకరణ అవసరమని స్పష్టం చేశారు.
   బి.జె.పి, సి.పి.ఐ (యం) ప్రతినిధులు సమావేశాలలో పాల్గొని పునర్‌వ్యవస్థీకరణ మీద కొన్ని సందేహాలను వ్యక్తం చేశారు. దీనిపై తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదని భావించారు.

3. చర్చలలో పాల్గొన్న వివిధ పార్టీల సంఘాల ప్రతినిధులు ఈ క్రింది అంశాలను, తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించారు.

ఏ) ప్రస్తుత పంచాయితీలు, ఆవాసాల ప్రజలు మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలి.

బి) ప్రస్తుత చిన్న పంచాయితీ ప్రాంతం లేదా ఆవాసానికి గుర్తింపు, దాని ప్రయోజనాలను తగిన విధంగా కాపాడాలి.

సి) పునర్వ్యవస్థీకరణ రాజకీయ పక్షపాతంతో, లేదా రాజకీయ ప్రయోజనాల దృష్టితో జరగకుండా, శాస్త్రీయంగా హేతుబద్ధంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి.

డి) పునర్వ్యవస్థీకరణలో జనాభాతో పాటు స్థానిక పరిస్థితుల వెసులుబాటు, దూరం వగైరాలను పరిగణలోకి తీసుకోవాలి.

ఇ) దళితులు, బలహీనవర్గాలకు క్రిందిస్థాయిలో అధికారం పొందే అవకాశాలను గరిష్టంగా కాపాడాలి.

ఎఫ్) ఈ పేరుమీద ఎన్నికలు నిరవధికంగా వాయిదా వెయ్యకుండా చూడాలి.

## 4. లోక్‌సత్తా ప్రతిపాదనలు

వివిధ పార్టీలు, పంచాయితీ సంస్థల ప్రతినిధులువ్యక్తం చేసిన అభిప్రాయాలు, చేసిన సూచనలు, లేవనెత్తిన సమస్యలు, సందేహాలను దృష్టిలో పెట్టుకుని లోక్‌సత్తా ఈ క్రింది ప్రతిపాదనలు చేస్తున్నది.

(ఎ) ప్రధాన పార్టీలు, సర్పంచుల సంస్థలు సూత్రప్రాయంగా పునర్వ్యవస్థీకరణను ఆమోదించినందున పంచాయతీల పునర్వ్యవస్థీకరణకు వెంటనే పూనుకోవలసిందిగా లోక్‌సత్తా విజ్ఞప్తి చేస్తున్నది.

(బి) చిన్న పంచాయితీల ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఇలాంటి అన్ని ఆవాసాలకు (హేబిటేషన్లకు) ప్రత్యేకంగా గ్రామ సభ వుండేలాగా, అక్కడ నుండి ఎన్నికైన వార్డు మెంబర్లు దానికి అధ్యక్షులుగా వ్యవహరించేలాగ, రోడ్లు, లైట్లు, పారిశుధ్యం వంటి స్థానిక అంశాలు ఆవాసం, గ్రామసభ అధికార పరిధిలోకి వచ్చే విధంగా చట్టబద్ధమైన ఏర్పాటు చెయ్యాలి.

(సి) పంచాయితీల పునర్వ్యవస్థీకరణ వల్ల దళితులూ బలహీనవర్గాలు, మహిళలు రాజకీయ ప్రవేశం సంఖ్యాపరంగా తగ్గకుండా వుండేలా వార్డుల సంఖ్య తగ్గకుండా చట్టబద్ధమైన ఏర్పాట్లు చెయ్యాలి. రిజర్వేషన్లని రాజ్యాంగం, చట్టం నిర్దేశించిన రీతిలో తూచ తప్పకుండా అమలు చేయాలి.

(డి) పునర్వ్యవస్థీకరణ జనాభాతోపాటు జనసాంద్రతనీ, దూరాన్ని దృష్టిలో పెట్టుకుని తగిన వెసులుబాటుతో జరపాలి.

(ఇ) పునర్వ్యవస్థీకరణ రాజకీయ పక్షపాతం లేకుండా జరగడానికి వీలుగా స్వతంత్ర ప్రతిపత్తిగల రాష్ట్ర ఎన్నికల కమీషన్‌కు బాధ్యత అప్పగించాలి.

(యఫ్)పునర్వ్యవస్థీకరణ తర్వాత అన్ని పంచాయితీలలో సిటిజన్స్ ఛార్టర్ల అమలుతో పాటు రెవెన్యూ సేవలు సర్టిఫికెట్లు, భూమి రికార్డులు స్థానికంగానే అందించగానికి తగిన సిబ్బంది, కంప్యూటరీకరణ గల యంత్రాంగాన్ని ప్రభుత్వం విధిగా ఏర్పాటు చెయ్యాలి.

ఈ పంచాయితీలలో ఆరోగ్య ఉపకేంద్రం, సంచార న్యాయాలయకేంద్రం, వ్యవసాయ విజ్ఞాన విస్తరణ కేంద్రం,ఉపాధి నైపుణ్యాల పెంపుదల కేంద్రం, పశువుల ఆస్పత్రి ఉపకేంద్రం వగైరాలు వుండేలాగా, మంచినీరు, పారిశుధ్య సేవలు తగిన యంత్రాంగంతో నిర్వహించేలాగా చర్యలు తీసుకోవాలి.

(జి) పునర్వ్యవస్థీకరించిన పంచాయితీలలో మౌలిక సదుపాయాల కల్పనకు, సేవలు అందించగానికి వీలుగా 1000 కోట్ల రూపాయలు ప్రభుత్వ ప్రత్యేక పాకేజీని ప్రకటించాలి.

హెచ్)అధికారాలు, నిధులు, సిబ్బంది లేని పునర్వ్యవస్థీకరణ వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం వుండదు. అందువల్ల పునర్వ్యవస్థీకరణ తో పాటే రాజ్యాంగం సూచించిన 29 అంశాలను పంచాయితీలకు నిజమైన అధికారాలతో బదలాయించాలి. రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లా బడ్జెట్‌ను సూచిస్తూ ప్రణాళికా నిధులలో 50 శాతం స్థానిక ప్రభుత్వాలకు కేటాయించాలి.

(ఐ) పునర్వ్యవస్థీకరణ కు సత్వర చర్యలు తీసుకుని సాధ్యమైనంత వరకు సకాలంలోనే ఎన్నికలు నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలి. పంచాయితీల పటిష్టతకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పునర్వ్యవస్థీకరణ, అధికారాల బదలాయింపు ద్వారా నిజమైన గ్రామీణాభివృద్ధికి శ్రీకారం చుట్టవలసిందిగా లోక్‌సత్తా విజ్ఞప్తి చేస్తున్నది. ✪

# సంఘబలంతో ప్రభుత్వ సేవలు

సర్ రతన్‌టాటా ట్రస్ట్ వారి సహకారంతో చేపట్టిన జనశిక్షణ కార్యక్రమం మనం విజయవంతంగా నిర్వహించాం. ఈ జన శిక్షణ ద్వారా ప్రజలకు పాలన పట్ల, స్థానిక సమస్యల పట్ల కొంత అవగాహన కల్పించాం. దీనికి కొనసాగింపుగా ఆసక్తి గల క్రియాశీల పౌరులను సంఘటిత పరచి స్థానిక సమస్యల పరిష్కారం కోసం కృషి చేయవలసి వుంది. సమాచార హక్కును, సిటిజన్స్ చార్టర్లను సాధనాలుగా మలుచుకుని తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం ప్రజలకు అలవాటు చేయవలసి వుంది. దీని ద్వారా మనం ప్రతి జిల్లాలో కొన్ని గ్రామాలు, ఒకటి, రెండు పట్టణాలలోనయినా లోక్‌సత్తా ప్రభావం స్పష్టంగా చూపించగలగాలి. ఇలాంటి కార్యక్రమం కోసం రతన్‌టాటా ట్రస్ట్‌వారు ఒక ప్రాజెక్ట్‌ను ఆమోదించారు.

## రతన్‌టాటా ట్రస్టు సహకారంతో లోక్‌సత్తా కార్యక్రమం

**లక్ష్యం :** స్థానిక సమస్యల పరిష్కారం కోసం పౌరులు పరిజ్ఞానంతో సంఘటితంగా ఉద్యమించేలా ప్రోత్సహించడం.

**మార్గం :** ఆసక్తి గల పౌరులను సమీకరించుకోవడం, వివిధ సంస్థల లబ్ధిదారులను సంఘటిత పరచడం. వారి ప్రాంతంలో వివిధ ప్రభుత్వ సంస్థలు ( పాఠశాల, ఆరోగ్య కేంద్రం, రేషన్‌షాపు, అంగన్‌వాడీ కేంద్రం, పంచాయతీ, మున్సిపాలిటీ వగైరా) అందించే సేవల స్థితిని అంచన వేయడం. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళడం సమస్యల పరిష్కారం కోసం, వివిధ ప్రజాస్వామ్య పద్ధతులలో కార్యక్రమాలు చేపట్టడం

### ప్రాజెక్ట్‌లోని ప్రధాన అంశాలు

- ప్రతి జిల్లాలో ఒక పట్టణంలో పదివార్డులు, రెండు, మూడు మండలాల పరిధిలోని పది గ్రామాలను ఎంపిక చేసుకోవాలి.
- పట్టణంలోనైతే పది వార్డులను ఒక యూనిట్‌గా, గ్రామాలైతే పది గ్రామాలను ఒక యూనిట్‌గా గుర్తిస్తారు.
- ప్రతి వార్డులో కనీసం 30 మంది క్రియాశీల పౌరులను, అక్కడ స్థానికంగా వున్న లోక్‌సత్తా ప్రజాసంఘం సభ్యులను, మనతో కలిసి పనిచేయడానికి సిద్ధపడేవారిని గుర్తించాలి.
- గ్రామంలోనైతే కనీసం 35 మంది క్రియాశీల పౌరులను గుర్తించాలి.
- వీరిలో ఆరుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేసుకోవాలి.
- ఈ 30 మందికి / 35 మందికి కలిపి ముగ్గురిని అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారులుగా (బృంద నాయకత్వం) ఎంపిక చేసుకోవాలి.

### చేయవలసిన కార్యక్రమాలు:

1. ప్రతి పట్టణం వార్డులో/ గ్రామంలో ఒక అవగాహన సమావేశం ఏర్పరచి క్రియాశీల పౌరులను, కార్యకర్తలను గుర్తించాలి.
2. ప్రతి వార్డు నుండి ఎంపికైన ఆరుగురు కార్యవర్గ సభ్యులకు ( మొత్తం 60 మందికి ) 2 బ్యాచ్‌లుగా శిక్షణ ఇవ్వాలి.
3. ఈ బృందం తమ వార్డు పరిధిలోని ప్రభుత్వ సేవలపై స్టేటస్ రిపోర్టు తయారు చేసుకోవాలి.
4. సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వాధికారులతో సంప్రదింపులు, ముఖాముఖి కార్యక్రమాలు, తదితర ప్రజాస్వామ్య పద్ధతుల్లో కార్యక్రమాలు చేపట్టాలి.
5. ప్రతి రెండు నెలలకు ఒకసారి బృంద నాయకత్వ సభ్యులు సమావేశమై కార్యక్రమాలు సమీక్షించుకోవాలి.
6. ఈ విధంగా రెండు సంవత్సరాలపాటు ఆయా వార్డులలో కృషి చేయడం ద్వారా కొన్ని స్పష్టమైన ఫలితాలు చూపించాలి. పాత స్టేటస్ రిపోర్టుతో పోలిస్తే మెరుగుదల స్పష్టంగా కనిపించాలి.
7. ఈ ప్రాజెక్ట్‌ను సమన్వయం చేయడానికి పూర్తి సమయం ఇవ్వగల కార్యకర్తను ప్రతి యూనిట్‌కు కో-ఆర్డినేటర్‌గా నియమించుకోవాలి.
8. జిల్లాస్థాయిలో ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేయడానికి ఆసక్తి కలిగి, సమయం ఇవ్వగలవారిని కాని జిల్లా ఆఫీసు బేరర్లలో ఒకరిని గాని లేదా తగిన మరొకరిని గాని కార్యక్రమ సమన్వయ కర్తగా నామనిర్దేశం చేయాలి.

మొదటి దశలో ప్రతి జిల్లాలో ఒక పట్టణ యూనిట్‌ను, ఒక గ్రామీణ ప్రాంత యూనిట్‌ను ఏర్పరచుకొని కార్యక్రమాలు చేపట్టవచ్చు. రెండవ దశలో మరల ఒక గ్రామీణ ప్రాంత యూనిట్‌ను, అవకాశాన్ని బట్టి మరొక పట్టణ యూనిట్‌ను ఏర్పరచుకుని కార్యక్రమాలు చేపట్టవచ్చు. ఈ విధంగా రాష్ట్రంలో మూడు సంవత్సరాలలో 40 పట్టణ యూనిట్లు, 50 గ్రామీణ ప్రాంత యూనిట్లు ఏర్పరచి కార్యక్రమాలు చేపట్టవలసివుంది.

# పాడుదమా !



పాడుదమా స్వేచ్ఛా గీతం
ఎగరేయుదమా జాతిపతాకం
దిగంతాల నినదించి - విశ్వ
విఖ్యాతి నొందగా జాతిగౌరవం ॥ పాడు ॥

జలియన్ వాలాబాగ్ దురంతపు
నెత్తుటి ధారల గొత్తుకుని
ఉరికొయ్యల చెరసాలల గోడల
దారుణాలు తలకెత్తుకుని
పొగిలిన కాలం - పోరాడిన కాలం
మరిమరి ఒక పరితలచుకుని
మృతవీరుల నెదనిడి కొలుచుకునీ... ॥ పాడు ॥

వందేమాతరమని నినదించిన
వీరుల శౌర్యము నలదికొని
స్వాతంత్ర్యం నా జన్మహక్కని
గర్జించిన గళమందుకుని
పోరాటబలం - స్వాతంత్ర్యఫలం
కలకాలం కాపాడుకుని
కడుగర్వంగా కొనియాడుకునీ.... ॥ పాడు ॥

మన్నెం గుండెల మంటై రగిలిన
విప్లవజ్యోతి స్ఫూర్తియని
గుండెకెదురుగా గుండెను నిలిపిన
తెలుగు సింగముల తెగువగని
చీకటి గుండెల - బాకై మెరిసిన
గరిమెళ్ళను గురుతుంచుకుని
మన తెలుగు తేజమును నింపుకునీ ॥ పాడు ॥

జనగణమనముల జాగృతి నింపి
జండా గాథలు చెప్పుకుని
జయహే జయజయహే జననీయని
జయగీతమ్ములు పాడుకుని
పావన చరితం - పరిమళ భరితం
అఖండ భారత ఖండమని
అది అక్షయ అమృత భాండమనీ ... ॥ పాడు ॥

(రచయిత పేరు ప్రచురితం కాలేదు)

# ఫొటోలతో ఓటర్ల జాబితా

ఫొటో గుర్తింపు కార్డు... దొంగ ఓట్లను అడ్డుకోవటమే దీని ప్రధాన ఉద్దేశం. కానీ.. ఈ కార్డుల పంపిణీ సవ్యంగా జరగలేదు. కార్డులు లేకున్నా.. 12 రకాల డాక్యుమెంట్లు చూపితే ఓటు వేసేందుకు అనుమతిస్తున్నారు. అవేవి లేకున్నా.. 'ఇతను ఫలానా రామయ్య' అని గజిటెడ్ అధికారులు ధ్రువీకరిస్తే చాలు ఓటేసేందుకు ఓకే అన్నారు. ఇలాంటి తప్పుడు ధ్రువీకరణలు చాలానే వచ్చాయి. ఇక 12 రకాల డాక్యుమెంట్ల సంగతి చెప్పనక్కర్లేదు. మరి దొంగ ఓట్లను అరికట్టడమెలా ? దీనికి ఎన్నికల సంఘం కొత్త పరిష్కారం కనుగొంది. అదే.. ఓటర్ల ఫొటోలతో కూడిన ఓటర్ లిస్టు. వచ్చే ఏడాది కేరళ, పాండిచ్చేరి శాసనసభలకు జరగనున్న ఎన్నికల్లోనే ఈ విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. మన రాష్ట్రంలో వచ్చే సంవత్సరం మధ్యనాటికి ఫొటో గుర్తింపు కార్డులను ఇచ్చే కార్యక్రమాన్ని పూర్తిచేసి... ఆ వెంటనే ఫొటోలతో కూడిన ఓటరులిస్టులను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఫొటోలు ఉన్న ఓటర్ల జాబితాలను రాజకీయ పార్టీలకు అందించరు. అవి ఎన్నికల అధికారుల వద్ద మాత్రమే ఉంటాయి. పోలింగ్ సమయంలో... ఫొటో గుర్తింపుకార్డును లేదా ఇతర డాక్యుమెంట్లను పరిశీలించిన మీదట, ఓటర్ల జాబితాలో ఉన్న ఫొటోను కూడా సరిచూశాకే ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తారు. వచ్చే ఏడు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో శాశ్వత ప్రాతిపదికన ఒక ఓటరు నమోదు కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. కొత్త ఓటర్ల నమోదు, గుర్తింపు కార్డుల జారీ, చిరునామాల్లో మార్పులు చేర్పులు అన్నీ ఇక్కడే చేపడతారు. ✪

## తెలుసుకోదగ్గ సమాచారం

# స్థానిక ప్రభుత్వాలకు నిధులు

స్థానిక సంస్థలకు కేటాయించే నిధులు నేరుగా వాటి బ్యాంకు ఖాతాలకు విడుదల చేయడానికి వీలుగా జీరో బ్యాలెన్స్‌తో ఖాతాలు తెరవాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కేంద్ర నిధులు విడుదల చేసినా అవి పంచాయతీ, మండలం, జిల్లా పరిషత్‌లకు చేరేందుకు దాదాపు రెండు నెలల సమయం పడుతున్న నేపథ్యంలో జాప్యాన్ని నివారించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఖాతాలు తెరిస్తే ఢిల్లీలో నిధులు విడుదల చేసినరోజే పంచాయతీలకు వస్తాయి. 12వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపుతోనే కేంద్రం దేశస్థాయిలో ఈ మార్పులు తీసుకొస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వులు నేపథ్యంలో... కొత్త ఖాతాలు సమాచార కేంద్రాన్ని (ఎన్ఐసి)కి సమర్పించాలి. కేంద్ర ప్రభుత్వ నోడల్ బ్యాంకులు తెలంగాణలో ఎస్బీహెచ్, ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో ఎస్బీఐలలో ఈ ఖాతాలు తెరవాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన డేటాబేస్‌ను జాతీయ పంచాయతీ పోర్టల్ సిద్ధం చేస్తోంది. ✪

## ఆంధ్రప్రదేశ్‌లో నమోదైన నేరాలు (గత మూడేళ్ళలో)

| నేరాల వివరాలు | 2003 | 2004 | 2005 (నవంబర్) |
|---|---|---|---|
| హత్యలు | 2472 | 2378 | 2361 |
| ఆస్తికోసం హత్యలు | 144 | 132 | 115 |
| దోపిడీలు | 170 | 152 | 222 |
| దారి దోపిడీలు | 622 | 559 | 712 |
| దొంగతనాలు | 8886 | 7967 | 7197 |
| సాధారణ నేరాలు | 21,469 | 21,681 | 20091 |
| వరకట్న హత్యలు | 107 | 111 | 99 |
| వరకట్న మృతులు | 450 | 488 | 373 |
| వరకట్న వేధింపులు | 6415 | 6746 | 5721 |
| అత్యాచారాలు | 901 | 898 | 764 |
| మహిళా హత్యలు | 611 | 614 | 554 |
| ఎస్‌సి,ఎస్‌టి కేసులు | 2147 | 2148 | 1796 |
| మహిళల అదృశ్యం | 746 | 579 | 747 |
| కిడ్నాపులు | 1029 | 1040 | 1012 |

# విశ్వసనీయత కోల్పోయిన ప్రభుత్వ వైద్యం
# పెనుభారంగా మారిన ప్రైవేటు వైద్యం

ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో డా॥ జయప్రకాష్ నారాయణ్

విదేశాలతో పోలిస్తే మన దేశంలో విద్య, వైద్య రంగాలకు అతి తక్కువ కేటాయింపులు జరుగుతున్నాయని లోక్‌సత్తా జాతీయ కన్వీనర్ జయప్రకాశ్ నారాయణ్ పేర్కొన్నారు. ఇదే కొనసాగితే ... ఇప్పటిదాకా దేశంలో ఉన్న గుండెజబ్బుల్ని నయం చేసేందుకు వెయ్యేళ్ల పైనే పడుతుందని అన్నారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో శుక్రవారం ఆయన 'ఆరోగ్య సంరక్షణ-భవిష్యత్తు' అనే అంశం గురించి ప్రసంగించారు. వైద్యరంగాన్ని సామాన్యుడికి కూడా అందుబాటులోకి తెచ్చేందుకు శాస్త్రవేత్తలు మరింత కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. గతంతో పోలిస్తే వైద్యం ఖరీదు తగ్గినా అది సామాన్యుడికి ఇంకా పూర్తిగా అందుబాటులోకి రాలేదని, శాస్త్ర పరిశోధనల ద్వారా ఈ లోటును పూడ్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దేశంలో ప్రభుత్వ వైద్యరంగం విశ్వసనీయత కోల్పోగా, ప్రైవేటు వైద్యరంగం సామాన్యుడికి పెనుభారంగా పరిణమించిందన్నారు. సరళీకరణ విధానాలపై దృష్టి సారించిన కేంద్రం, ఆ క్రమంలో ఎన్నో అంశాల్ని విస్మరించడం వల్లే దాని ఫలితాలు సక్రమంగా రాలేదని అభిప్రాయపడ్డారు. వైద్యరంగానికి కేవలం కేటాయింపులు చేసేసి ఊరుకోవడం కాదని, ప్రభుత్వ దృక్కోణంలో మార్పు రావాలన్నారు. అలాగే బిల్లులు పెంచేందుకు ప్రైవేటు వైద్యరంగం అనుసరిస్తున్న అవాంఛనీయ విధానాల వల్ల సామాన్యుడు పూర్తిగా నష్టపోతున్నాడని విమర్శించారు. విలువలను తుంగలో తొక్కేందుకు ప్రైవేటు వైద్యరంగం అవసరమైన దానికంటే ఎక్కువ పెట్టుబడులను పెట్టి ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తోంది. కొన్నేళ్ల క్రితం లండన్ నగరం మొత్తానికి రెండు ఎమ్మార్రైలుంటే, ఆ సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోనే 14 ఎమ్మార్రైలు ఉన్నాయి. ఇందులో హైదరాబాద్‌లో 9 ఉన్నాయి అన్నారు. వైద్యాన్ని సామాన్యుడికి అందుబాటులో ఉంచేందుకు, ఈ రంగంలో జవాబుదారీ తనాన్ని పెంచేందుకు ప్రభుత్వ పరంగా కృషి జరగాలని అభిప్రాయపడ్డారు. ✪

## సూక్తులు

1. పరభాష ద్వారా నేర్పే విద్య సోపానాలు లేని సౌధం వంటిది. - రవీంద్రుడు
2. మనం ఎలా వుండాలో ఏకాంతం నేర్పుతుంది. మనం ఎలా వున్నామో సమాజం చెపుతుంది - సెసిల్
3. మనం సాధించాలి అనుకున్న లక్ష్యాన్ని మర్చిపోవడమే మనం చేసే అతి పెద్ద నేరం - పాల్
4. సాహసవంతులు వున్నంతవరకే దేశం స్వతంత్రంగా మనగలుగుతుంది - డేవిస్
5. ఇబ్బందికరమైన ప్రశ్నలు వుండవు ఇబ్బందికరమైన సమాధానాలే వుంటాయి - కార్ల్ రోవన్
6. ఒక పౌను చదువును ఆచరణలో పెట్టడానికి పది పౌన్ల లోకజ్ఞానం కావాలి - పర్షియన్ సామెత
7. ఏదైనా సాధించాలనుకున్నప్పుడు శ్రమపడేతత్వం వుండాలి విమర్శల నెదుర్కునే సహనం వుండాలి. - బెట్‌డేవిస్
8. పుస్తకాలు దీపాలు అవి మనోమాలిన్యమనే చీకటిని తొలగిస్తాయి - అంబేద్కర్
9. ఇతరులను ప్రేమించగలిగేవాడు స్వేచ్ఛను ప్రేమిస్తాడు తనను తాను ప్రేమించుకునేవాడు అధికారాన్ని ప్రేమిస్తాడు - హజ్‌వెట్

# లోక్‌సత్తా ప్రజారాజ్యం శిక్షణా కార్యక్రమం

లోక్‌సత్తా జనరల్ బాడీ సమావేశం నిర్ణయాలు (2006 జనవరి 8,9- ఆకివీడు

1. జనబలం పేరుతో గతంలో మన పౌరులకు శిక్షణ ఇచ్చాం. ఇప్పుడు కొత్తరాజకీయ సంస్కృతికోసం పంచాయతీ ఎన్నికలలో పోటీ చెయ్యాలన్న ఆసక్తిగల వారికి ప్రజారాజ్యం పేరుతో స్థానిక నాయకత్వ శిక్షణను నిర్వహించాలి. రాష్ట్రంలో సుమారు 20,000 మందికి ఈ శిక్షణ ఇవ్వడం మన లక్ష్యం.
   (ఎ) రాష్ట్రస్థాయి శిక్షకులకు శిక్షణ :
   2006 జనవరి 10వ తేదీన రాష్ట్రస్థాయి శిక్షకులకు శిక్షణా కార్యక్రమం ఆకివీడులో జరిగింది.
   (బి) జిల్లా స్థాయి శిక్షకులకు శిక్షణ :
   ప్రతి జిల్లాలో స్థానిక నాయకత్వ శిక్షణ ఇవ్వడానికి వీలుగా జిల్లా స్థాయి శిక్షకులను గుర్తించి శిక్షణ ఇవ్వాలి. ప్రతిజిల్లాల 25 నుండి 40 మందికి ఇలాంటి శిక్షణ ఇవ్వాలి.
   ఈ శిక్షణ పట్ల ఆసక్తి వుండి కనీసం మూడు, నాలుగు శిక్షణా శిబిరాలను నిర్వహించడానికి సమయం ఇవ్వగలవారై వుండాలి. శని, ఆదివారాలే కాకుండా ఇతర రోజులలో కూడా సమయం ఇవ్వగల వారు ఎక్కువ మంది వుండాలి.
   1. లోక్‌సత్తా జిల్లా, పట్టణ, మండల ఆఫీసు బేరర్లలో ఇలాంటి ఆసక్తిగల వారిని ఎంపిక చెయ్యాలి.
   2. రిటైర్డ్ ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఈ శిక్షణ పట్ల ఆసక్తి గల ఇతరులను తగిన సంఖ్యలో ఎంపిక చేసుకోవాలి.
   3. మహిళల నుండి కనీసం 5-10 మంది శిక్షకులుగా తీసుకోవాలి. వీరికి జిల్లా స్థాయిలో రెండు రోజులు శిక్షణ ఇవ్వాలి.
2. జనవరి 20 నుండి ఫిబ్రవరి 15 లోగా అన్ని జిల్లాల్లో ఈ శిక్షణ పూర్తి చెయ్యాలి. ఈ శిక్షణకు తేదీలు నిర్ణయించి తెలియజేస్తే రాష్ట్రస్థాయి శిక్షకులు హాజరవుతారు.
3. స్థానిక నాయకత్వ శిక్షణ - కరపత్రాలు, దరఖాస్తులు - ఎంపిక :

   ఎ) స్థానిక నాయకత్వ శిక్షణ కావాలని కోరుకునే వారు ఎలాంటి షరతులకు లోబడి దరఖాస్తు చేసుకోవచ్చునో వివరించే కరపత్రాలు ప్రచురించాం. ఈ కరపత్రాలు ప్రతి గ్రామానికి అందేలా ఏర్పాటు చేసుకోవాలి.
   1) మన లోక్‌సత్తామండల, పట్టణ శాఖలద్వారా (2) వార్తా పత్రికలలో కరపత్రాలు పెట్టి పంపించడం ద్వారా 3) ఉపాధ్యాయుల ద్వారా (4) డ్వాక్రా, వెలుగు గ్రూపుల లీడర్లకు, యువజన సంఘాలకు (ఎమ్.డి.ఓస్ ఆఫీసులో లిస్టులు దొరుతాయి) అందే ఏర్పాటు చేయాలి.

   బి) దరఖాస్తు ఫారాలను జిల్లా శాఖాలకు పంపుతున్నాం. వాటిని మండల లోక్‌సత్తా ఆఫీసులలో కూడా అందుబాటులో వుంచండి. తెలుగు వెబ్‌సైట్ **డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. లోక్‌సత్తా.ఒ.ఆర్.జి** నుండి దరఖాస్తు ఫారాలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. దాని జిరాక్స్ కాపీలు దరఖాస్తుకు వినియోగించుకోవచ్చును. కోరినవారికి అందేలా ఏర్పాటు చేయండి.

సి)	దరఖాస్తు ఫారాలు నేరుగా దరఖాస్తు ఫారంలో వున్న హైద్రాబాద్ అడ్రసుకు పంపించాలి. జిల్లా, మండల ఆఫీసులకు వచ్చిన దరఖాస్తులను కూడా హైదరాబాద్‌కు పంపండి. ఈ దరఖాస్తులను హైదరాబాదా ఆఫీసులో జిల్లా, మండల, గ్రామంవారీగా కంప్యూటర్‌లో నిక్షిప్తం చేసి ఎంపిక చేయడానికి తగిన సంక్షిప్త సమాచారంతోపాటు, దరఖాస్తు ఫారలను తిరిగి జిల్లాలకు పంపుతాం.

డి)	శిక్షకులను ఎంపిక చెయ్యడానికి తగిన మార్గదర్శక సూత్రాలను రూపొందించి జిల్లాలకు తెలియపరుస్తాం. ఈ మార్గదర్శక సూత్రాలకు అనుగుణంగా ఎంపిక చేసుకోవాలి.

ఇ)	ప్రతి 50,60 మంది దరఖాస్తు దారులను ఒక బృందంగా ఏర్పాటు చేసి శిక్షణ ఇప్పించాలి. మూడు నాలుగు మండలాల పరిధిలో లేదా అంతకు తక్కువ పరిధిలో వచ్చిన అప్లికేషన్ల ఆధారంగా అతి దగ్గరలో శిక్షణ ఏర్పాటు చెయ్యాలి. రాత్రిపూట బస ఏర్పాటు లేకపోయినా వచ్చిపోవడానికి వీలుగా వుండాలి.

యఫ్)	దరఖాస్తు దారులనుండి కనీసం 25 రూపాయలు రుసుం వసూలు చెయ్యాలి. అదనంగా ఇచ్చే వారి నుండి వారి అంగీకారం మేరకు తీసుకోవాలి.

కొత్త రాజకీయా సంస్కృతి కోసం తలపెట్టిన ఈ శిక్షణను ఒక ఉద్యమంగా భావించి విజయవంతం చెయ్యాలి.

## పంచాయితీలు : ఎంత జనాభాకి ఎందరు సభ్యులు

| గ్రామ జనాభా | మొత్తం సభ్యుల సంఖ్య (సర్పంచితో) |
|---|---|
| 300 జనాభా వరకు | 5 |
| 300 జనాభా పైన 500 లోపు | 7 |
| 500 జనాభాపైన 1500 లోపు | 9 |
| 1500 జనాభాపైన 3000 లోపు | 11 |
| 3000 జనాభాపైన 5000లోపు | 13 |
| 5000 జనాభాపైన 10,000 లోపు | 15 |
| 10,000 జనాభా పైన 15,000 లోపు | 17 |
| 15,000 జనాభా పైన | 19-21 మధ్య |

## పంచాయితీ ఎన్నికల ఖర్చు - ఎన్నికల కమీషన్ విధించిన గరిష్ట పరిమితి

| | |
|---|---|
| సర్పంచి (నోటిఫైడ్ పంచాయితీలకు) | రూ॥ 40,000 |
| వార్డు సభ్యులు (నోటిఫైడ్ పంచాయితీలకు) | రూ॥ 5,000 |
| సర్పంచి (నాన్-నోటిఫైడ్ పంచాయితీలు) | రూ॥ 20,000 |
| వార్డు సభ్యులు (నాన్-నోటిఫైడ్ పంచాయితీలు) | రూ॥ 3,000 |